## నండూరి విఠల్



# విన్నపాలు

మా బామ్మ పోతూ పోతూ ఈ వీధిచివర ఉన్న మండువాయిల్లు మాయింటావిడ పేర రాసి మరీ పోయింది. నాలుగు రాళ్ళు ఎక్కువిస్తానన్నాడని— మనస్సు కీడు శంకిస్తున్నా. దాన్ని ఓ ఆసామీకి అద్దెకిచ్చాను మా యింటావిడ సలహాపై.

ఆ అసామీపేరు బండ వీరాసామి. వృత్తి కుస్తీ పోటీలు.

ఆ వస్తాదు ఒకనెల ఎడ్వాన్సు యిచ్చి- అద్దెకు యిళ్ళుతీసుకునే ఆసామీలందరి లాగానే సలక్షణంగా యింట్లో ప్రవేశించాడు శిష్యగణంతో సహా. పదినెల్లయింది. నాటికీ నేటికీ అద్దెతాలూకు రాగిపైసాయివ్వలా. "తొమ్మిదినెలల అద్దెబాకీ పెడితే ఎవరూరుకుంటారండీ? మనల్ని మరీ వాజమ్మల్నిచేసి ఆడిస్తున్నాడా వీరాసామి" అంటూ మాయింట విడ సన్నాయి నొక్కులు నొక్కుతున్న కొద్దీ నా సహనం నీరసించింది. ఆ 'వాజమ్మ' అనే విశేషణం నా తాలూకు దేనని మా శ్రీమతి నమ్మకమని నాకు అనుమానం కలిగింది.

పౌరుష మొచ్చింది.

వచ్చి — బండవీరాసామికి ఘాటుగా ఓ రిజిస్టర్డ్ నోటీసు తగిలించాను. దాని నకలు తమ ముందుంచుతున్నా. తప్పులుంటే చెప్పండి.

అది ఇది.

"ఘనమైన అయ్యా!

కలియుగ భీములూ, వీరహనుమాన్ ప్రియ భక్తాగ్రేసరులూ, అఖిలభారత మల్లయుద్ధ పోటీలలో సువర్ణకంకణ విజేతలూ అయిన బండ వీరాసామిగారి దివ్యసన్నిధికి తమ వసతిగృహ యజమాని కట్టుకున్న భర్త సీతాపతి వ్రాసుకున్న విన్నపాలు.

గత వారంరోజులుగా మన ఊరి చింతలతోపులో అర్భకులైన వేలాది ప్రజల సమక్షంలో - చండప్రచండులైన, అఖిలభారత వస్తాదుల నెందరినో చిత్తుచేస్తున్న విషయం - కర్ణాకర్ణిగా వినడమేగాని కనులారా చూసే భాగ్యానికి నోచుకున్నవాణ్ణికాదు.

ఇందుకు కేవలం నా అనారోగ్యమే కారణంగాని — తమయందుగల ఉపేక్ష మాత్రం ఎంతమాత్రం కారణంకాదంటే తమరు నమ్మగలరనుకుంటాను. తిరుగులేని భుజబలంగల తమబోంట్లు మా యింట్లో అద్దెకుండటమే మాకు కొండంత పెట్టు. ఒక్క మా కుటుంబానికేగాక, ఈ వీధికట్టు యావత్తుకు విజానికి తమఉనికే ఒక శ్రీరామరక్ష.

ఒక చిన్న మనవి.

మరేమంత పెద్దవిషయం కాదనుకోండి—

తమరు గత పదినెలలుగా అద్దెచెల్లించలేదు. పెద్దమనుషులకు లక్షపనులు. పనులవల్ల తీరికలేక మరిచిపోయివుంటారు. మరీ పేరుకుంటున్న అద్దెబాకీ విషయం, లోగడ పోస్టు బంట్రోత్తు పీరుసాయిబుద్వారా తమకు గతంలో నాలుగైదుసార్లు వర్తమానాలు పంపుకున్నాను. నా విన్నపాలను తమకు అందించడం అతగాడూ మరిచిపోయివుంటాడు.

మరో స్వల్ప విషయం—

మనయింటి దూలాలను తమరు



యువ

కొన్నింటిని పీకినట్లున్నూ, వాటితో మన పెరట్లో బస్కీలు తీయించేటందుకు నిచ్చెనల పోలికలున్న ఏదో కట్టడాన్ని నిర్మించినట్లున్నూ ఓ గాలివార్త నా చెవిలో పడింది.

తమరు ఏదో సదుద్దేశంతోనే యింతటి ఘనకార్యాన్ని తలపెట్టివుంటారనే విషయం తెలియనివాణ్ణికాదు. కాని నా మనస్సులోని భయాన్ని తమ ముందుంచడం నా విధి.

తమరుంటున్న వసతిగృహం — మా యింటావిడకు వాళ్ళ బొమ్మ పోతూపోతూ యిచ్చిపోయిన—తాతలనాటి పెంకుటిల్లు. ఎన్నడో కూలిపోవలసిన పాతకొంప. అయినా తమకు జడిసి అలా నిలిచివుంది.

మనవిచేసే దేమిటంటే—మరో పోటీ పెట్టకుండా — ఆ దూలాలుపీకితే — అది అర్ధంతరంగా కూలి — తమ నెత్తినపడే ప్రమాదముంది. తమకేదన్నా జరిగితే — ఈ వాడకట్టుకేగాక — యావత్తూ భారత దేశానికే తీరనినష్టం. మీకు అటువంటి ఆపదరాకుండా పరమేశ్వరుడు ఆయురారోగ్య ఐశ్వర్యాలు ప్రసాదించుగాక—

చిట్ట చివరి మనవి——

అద్దె బాకీ యావత్తూ ఒకేసారి తమరు అనుగ్రహించినా — ఒక్కసారి నేనేం చేసుకుంటాను గనుక — నెలకు నాలుగైదు రూపాయలవంతున తమరు పంపినా — తమ ఖాతాలో కట్టుకుంటాను. ఆ రేటున తమ పదినెలల అద్దెబాకీ యావత్తూ తీరటానికి కనీసం ఓ పుష్కరం పడుతుంది గనుక— ఈ లావాదేవీల పుణ్యమా అని మా యిల్లు మీరు ఖాళీచేసినా — మన స్నేహ బాంధవ్యాలు పదికాలాలపాటు దిమ్మిసాచేసినట్లు నిలిచివుండే సదవకాశం కలుగుతుందని సంబరపడుతున్నా.

అన్నట్లు—తమ శిష్య పరమాణువు భజరంగ పహిల్వాన్‌గారిని మొన్న కూరగాయల అంగడిలో కలుసుకునే భాగ్యం కలిగింది. ఇదమిత్థమైన కారణంగా మనయిల్లు ఖాళీచేయాలనే తలంపు తమకు ఆ మధ్య కలిగినట్లు విన్నాను.

తమకు తగిన వసతిగల యింట్లోనే తమరు సుఖశాంతులతో హాయిగా బ్రతకాలని త్రికరణశుద్ధిగా కోరుకునే తమ శ్రేయోభిలాషుల్లో నేనొకణ్ణి. మన పార్థసారధిస్వామి కోవెల వెనుకగల పరాంకుశంగారి మండువాయిల్లు తమకు తగినంత వసతిగానే వుంటుందిమరి.

తమరు మనయిల్లు ఖాళీచేసేటప్పుడు— యిల్లుతాళంవేసి ఆ తాళంచెవిని పోస్టు బంట్రోతు పీరుసాయిబుద్వారా నాకు ముట్టచెబితే అదేపదివేలు. తమరుమహానుభావులైన పెద్దలు. తమరే స్వయంగా తాళంచెవి యివ్వడానికి రావడం జరిగితే— అది నేను పెద్దలపట్ల చేసిన అపచారమే గదా మరి.

ఇట్లు

తమ శ్రేయోభిలాషి

మన వసతిగృహ యింటియజమాని

సీతాపతిరావు. ✱